సాక్షి
వరంగల్
శుక్రవారం । 16 । ఆగస్టు । 2024

నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు



సమగ్రాభివృద్ధే లక్ష్యం



ఖిలావరంగల్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ సత్య శారద





ప్రసంగిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి

వరంగల్ నగరంపై సీఎం ప్రత్యేక దృష్టి

- రూ.80 కోట్లతో కలెక్టరేట్ నిర్మాణ పనులు
- సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనుల్లో వేగం
- రూ.17.90 కోట్లతో 452 పాఠశాలల్లో వసతులు
- స్వాతంత్ర్య దినోత్సవంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఖిలావరంగల్ ఖుష్‌మహల్‌లో రెపరెపలాడిన త్రివర్ణ పతాకం

ఖిలా వరంగల్:

జిల్లా సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, ఐఅండ్‌పీఆర్, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఖిలావరంగల్ మధ్యకోటలోని ఖుష్‌మహల్ ప్రాంగణంలో గురువారం కలెక్టర్ సత్య శారద అధ్యక్షతన 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ప్రత్యేక వాహనంలో కలెక్టర్ సత్య శారద, ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్‌తో కలిసి ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.69 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేశారని వెల్లడించారు. పక్కాగా ఆరు గ్యారంటీలు అమలుచేస్తున్నట్లు తెలిపారు.

- రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.ఐదు లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, గృహజ్యోతి పథకం ద్వారా అర్హత ఉన్న కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని ఆయన తెలిపారు
- బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.72 వేల కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. వరంగల్‌లో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌కు కట్టుబడి రుణమాఫీ అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం కింద రైతులకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని వివరించారు.
- గత పాలకులు నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి ఏమైందో నగర వాసులకు తెలుసని పేర్కొన్నారు. ఎస్సారెస్పీ స్టేజ్–1, 2 ద్వారా 72 వేల ఎకరాలకు సాగునీరు, పాకాల ద్వారా 18,193 ఎకరాలు, 815 చెరువుల కింద ఖరీఫ్‌లో 65, 895 ఎకరాలు, రబీలో 45 వేల ఎకరాలకు సాగునీరు అందించామని వివరించారు. రూ.14.85 కోట్లతో చెక్‌డ్యాంలు నిర్మించినట్లు ఆయన పేర్కొన్నారు.
- గత ప్రభుత్వం ధరణి పేరుతో భూ విధ్వంసానికి పాల్పడితే.. నేడు సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో చిక్కులు లేని రెవెన్యూ చట్టం ద్వారా జిల్లాలో భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు.
- దివంగత సీఎం రాజశేఖరరెడ్డి నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లే జిల్లాలో కనిపిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. అర్హులకు రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలన్న లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.
- నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. జిల్లాలో నైపుణ్యాభివృద్ధి కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రూ.17.90 కోట్లతో 452 పాఠశాలల్లో వసతులు కల్పించామని చెప్పారు.
- వరంగల్ నగర అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారని, కాకతీయుల పాలించిన ఓరుగల్లును రాష్ట్రానికి రెండో రాజధానిగా అభివృద్ధి చేయాలని, హైదరాబాద్‌కు దీటుగా నగరాన్ని అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఫార్మాసిటీ, ఐటీ, మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు, ఎకో టూరిజం, విద్యాసంస్థలు, స్టేడియం, మామునూరు ఎయిర్‌పోర్ట్, లాజిస్టిక్స్ పార్కు, టూరిజం వంటి అంశాలు ఉండేలా మాస్టర్‌ప్లాన్ తయారు చేస్తున్నామని తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కృషి చేస్తామని, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచామని, త్వరలోనే నర్సంపేటలో వైద్య కళాశాల ప్రారంభిస్తామని చెప్పారు.
- నగరాన్ని వరద ముప్పు నుంచి కాపాడేందుకు నాలాలను విస్తరిస్తున్నామని, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్) బలోపేతం చేస్తున్నామని వివరించారు. బస్టాండ్ పనుల్లో వేగం పెంచామని చెప్పారు. కాకతీయ కాలం నాటి ఆలయాలను పునరుద్ధరిస్తామని వివరించారు. వచ్చే నెల 9న కాళోజీ కళాక్షేత్రాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామని, రూ.80 కోట్లతో కలెక్టరేట్ నిర్మిస్తున్నామని, అన్ని హంగులతో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు పనులు పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 20 లక్షల మొక్కలు నాటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేశారు.

- ఉత్తములకు ప్రశంస పత్రాలు 8లో▸

కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య వేడుకలు..



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న కలెక్టర్ సత్య శారద

కాళోజీ సెంటర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, విద్యార్థులకు కలెక్టర్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, పర్యవేక్షకులు రమేశ్ చంద్రశేఖర్, మంజుల, పవన్‌కుమార్, కలెక్టరేట్ సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు ఘన సన్మానం..

కలెక్టర్ సత్య శారద, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ రవీందర్‌తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శాలువాలు కప్పి పూలమాలలతో స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు. కల్లుగీత కార్మికులకు మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా కాటమయ్య రక్షక కవచాలను పంపిణీ చేశారు. వరంగల్ ఆర్డీఓ కృష్ణవేణి, ఏసీపీ నందిరాంనాయక్, తహసీల్దార్లు ఇక్బాల్, బండి నాగేశ్వర్‌రావు, ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ, నాయకులు దామోదర్‌యాదవ్, బోగి సురేశ్, సంగరబోయిన చందర్, సార సాంబయ్య, ఎంఏ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య సమరయోధులకు నమస్కరిస్తున్న మంత్రి పొంగులేటి

న్యూస్‌రీల్

వడ్లను బస్తాల్లో నింపే పరికరం

- తయారు చేసిన నాచినపల్లి విద్యార్థి



దుగ్గొండి: ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడటంతోపాటు కూలి రేట్లు ఎక్కువగా ఉన్నాయి. రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు. దీంతో ధాన్యాన్ని బస్తాల్లో నింపే పరికరాన్ని తయారు చేశాడు.. దుగ్గొండి మండలం నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి కొమ్మెర దినేశ్. ఈ మేరకు ఇంటింటికీ ఇన్నోవేటర్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఖిలావరంగల్ కోటలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో విద్యార్థి దినేశ్ తయారు చేసిన పరికరాన్ని ప్రదర్శించాడు. ఒక స్టాండ్‌పై లెదర్ బెల్టు అమర్చి బెల్టుపై పాత్రలను అమర్చాడు. చక్రాన్ని విద్యుత్ మోటారుకు అనుసంధానం చేశాడు. ఇక మోటారు ఆన్‌చేసే బెల్టు తిరుగుతూ ఉంటే పాత్రల ద్వారా వడ్లు బస్తాలోకి వచ్చే ఏర్పాటు చేశాడు. ఈ మేరకు దినేశ్, గైడ్ టీచర్ సుధీర్‌కుమార్‌ను కలెక్టర్ సత్యశారదాదేవి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిలక్ష్మి అభినందించారు.

బంజారాల సంస్కృతిని కాపాడాలి

పర్వతగిరి: బంజారాల సంస్కృతీసంప్రదాయాలను కాపాడాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. ఈ మేరకు ఇస్లావత్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని పలు తండాల్లో గురువారం తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మూడుతండా, ధరంసోత్ తండా, భూక్యాతండా, నల్లబోడుతండా, మంగళిబోడుతండాల్లో జరిగిన తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు తీజ్ బుట్టలతో సందడి చేశారు. అనంతరం బంజారా యువతీయువకులు, మహిళలతో కలిసి స్టెప్పులు వేశారు. వేడుకల్లో ఇస్లావత్ సావిత్రి, ఇస్లావత్ లాక్యా, రవీందర్, అనిల్, సుశీల, సునీత, వెంకన్న, సుమన్, మూడు వెంకన్న, మూడు రవీందర్, ధరంసోత్ బొంద్యాలు పాల్గొన్నారు.

తండాల్లో తీజ్ సందడి..



గీసుకొండ: మండలంలోని హర్జ్యా, దస్రు, గోప్యా, నందనాయక్, ఎస్‌టీ, దూద్యా తండాల్లో గురువారం సాయంత్రం నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు. మేరామా యాడీ అంటూ పెళ్లికాని యువతులు గోధుమ మొలకల బుట్టలు పట్టుకుని నాట్యం చేశారు. ఎమ్మెల్యే వారితో కలిసి స్టెప్పులు వేశారు. కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, సాయిలి ప్రభాకర్, కేలోత్ స్వామి చౌహాన్ పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

గీసుకొండ: వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ రెడ్డిపాలెం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన పప్పుల నాగేంద్రమ్మ (75) ఒంటరిగా ఉంటూ అనారోగ్యంతో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెందిన ఆమె బుధవారం ఇంటిలో గడ్డిమందు తాగింది. గమనించిన స్థానికులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. నాగేంద్రమ్మ కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ సీఐ బాబూలాల్ తెలిపారు.

చికిత్స పొందుతున్న ఆటోడ్రైవర్ మృతి

నర్సంపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఆటోడ్రైవర్ మృతి చెందిన సంఘటన ఇటుకాలపల్లి శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలంలోని ఆకులతండా గ్రామానికి చెందిన శ్రీరాం హరిబాబు (51) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆకులతండా నుంచి గురువారం నల్లబెల్లి వైపు వెళ్తున్నాడు. ఇటుకాలపల్లి శివారులోని మలుపు వద్దకు చేరుకునే సరికి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటో డ్రైవర్ హరిబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

పూల ధరలు పైపైకి..

- శ్రావణ మాసంతో పెరిగిన డిమాండ్
- విక్రయాలు తగ్గాయంటున్న వ్యాపారులు



నర్సంపేటలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

పూలు	గతంలో ధరలు (కిలో రూ.లు)	ప్రస్తుత ధరలు
బంతి	60	160
చామంతి	250	400
పారబంతి	150	300
పూలుకట్టే ఆకు	50	100
కాగడమల్లె	1000	1,600
గులాబీలు	150	300
లిల్లీ	75	300
దొడ్డుమల్లె	900	1,500
సన్నమల్లె	900	1,500

నర్సంపేట: నిత్యావసర సరుకుల ధరలే కాదు.. ఆలయాలు, ఇళ్లలో పూజలకు ఉపయోగించే పూల ధరలు కూడా కొండెక్కాయి. శ్రావణ మాసం కావడంతో పూల ధరలు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. దీనికి తోడు ఈనెల 18న గృహ ప్రవేశాలు, వివాహాలు, శుభకార్యాలు ఉండడంతో పూలతోపాటు తమలపాకులకు డిమాండ్ బాగా పెరిగింది. మహారాష్ట్రలోని నాందేడ్, ముకేడ్‌తోపాటు హైదరాబాద్ నుంచి వరంగల్‌కు పలు రకాల పూలు వస్తున్నాయి. వరంగల్ నుంచి నర్సంపేట, వర్ధన్నపేట, గీసుకొండ, పర్వతగిరి, నెక్కొండ మండల కేంద్రాలకు పూలు సరఫరా అవుతున్నాయి. ఈ ప్రాంతాల్లో సాధారణ రోజుల కంటే రెండుమూడింతలు రేట్లు పెంచి వ్యాపారులు పూలు విక్రయిస్తున్నారు. దీంతో పూల కొనుగోలుకు అధిక మొత్తంలో వెచ్చించాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. కాగా, పెరిగిన ధరలతో పూల అమ్మకాలు తగ్గిపోయాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

వ్యాపారం తగ్గింది..



గతంలో ఎన్నడూ లేని విధంగా పూల ధరలు పెరిగాయి. మేము కూడా పెరిగిన ధరలకు అనుగుణంగా అమ్ముతున్నాం. మా వద్దకు వచ్చే వారికి ధర చెబితే తక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. దీంతో వ్యాపారం కూడా అంతంతమాత్రంగానే ఉంది.

– ఆముదాల వెంకటమ్మ, పూల వ్యాపారి

మూడో విడత రూ.112.51 కోట్లు

- రైతు రుణమాఫీ కింద వచ్చిన నిధులు
- లబ్ధి పొందనున్న 9,378 మంది రైతులు
- మూడు విడతల్లో కలిపి రూ.374.51 కోట్లు



సాక్షి, వరంగల్: జిల్లాలో మూడో విడత రూ.రెండు లక్షలకు సంబంధించిన రైతు రుణమాఫీ నిధులు గురువారం మంజూరయ్యాయి. 9,378 మంది రైతులకు రూ.112.51 కోట్ల నిధులు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయి. దీంతో ఇప్పటివరకు తొలి విడత 22,061 మంది రైతులకు రూ.116 కోట్లు, రెండో విడత 16,825 మంది రైతులకు రూ.146 కోట్లు రుణమాఫీ అయిన సంగతి తెలిసిందే. మొత్తం మూడు విడతల్లో కలిపి 48,264 మంది రైతులకు రూ.374.51 కోట్ల రుణమాఫీ అయ్యింది. ఇదిలా ఉండగా తమకు అర్హత ఉన్నా కూడా రుణమాఫీ కాలేదంటూ వందల సంఖ్యలో రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. రూ.రెండు లక్షల రుణమాఫీ కూడా కాకపోవడంతో పలువురు రైతులు ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయ అధికారులు భరోసానిస్తున్నారు. అర్హుల పేర్లు రాకుంటే పూర్తి వివరాలతో సంప్రదించాలని కోరుతున్నారు.

సంకల్పంతో నిలబడి..!

నాడు ఒకే ఒక విద్యార్థి.. నేడు 54 మంది

- రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెరిగిన అడ్మిషన్లు
- ఉపాధ్యాయుల కృషి.. గ్రామస్తుల సహకారంతో పూర్వవైభవం
- పదో తరగతిలో ఆరు సంవత్సరాలుగా వంద శాతం ఉత్తీర్ణత



రంగాపురం పాఠశాలలో విద్యార్థులతో ప్రార్థన చేయిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)




మండలస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందిస్తున్న డీఈఓ వాసంతి (ఫైల్)

నల్లబెల్లి: ఉపాధ్యాయుల కృషి, గ్రామస్తుల సహకారంతో ఆ బడి నిలబడింది. మూసివేసే పరిస్థితి దరిదాపుల్లో లేకుండా పోయింది. క్రమంగా విద్యార్థుల సంఖ్య పెరిగింది. రంగాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2018–19 విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి ఒకే ఒక విద్యార్థి మాత్రమే చదువుకునేవాడు. ఆసమయంలో పాఠశాలకు బదిలీపై ఎం.శ్రీనివాసరావు హెచ్‌ఎంగా వచ్చారు. ఒక్క విద్యార్థే ఉండడంతో ఆయనకు ఏం చేయాలో తోచలేదు. సహచర ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాల మూతపడే పరిస్థితి నుంచి గట్టెక్కించాలని, విద్యార్థుల ప్రవేశాలు పెంచేలా పూర్వవైభవం తేవాలని నిర్ణయం తీసుకున్నారు. మరుసటి రోజు పాఠశాలలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. అదే సమయంలో పాఠశాలలో చదువుతున్న ఏకైక విద్యార్థి తండ్రి వచ్చి టీసీ ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేశాడు. ప్రధానోపాధ్యాయుడితోపాటు ఉపాధ్యాయులు అతడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందిస్తామని, అడ్మిషన్లు పెంచుతామని భరోసా ఇచ్చారు. ఉపాధ్యాయులు సుమారు పది రోజులు రంగాపురం, ధర్మారావుపల్లి గ్రామాలను సందర్శించారు. గడపగడపకు తిరిగి విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పంపించొద్దని, ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలను వివరించారు. తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఇంగ్లిష్ మీడియం ప్రారంభిస్తామని హామీ ఇచ్చి 14 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించుకున్నారు. ఉన్నతాధికారుల అనుమతితో 6, 7వ తరగతుల విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో బోధించారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో 8, 9, 10 తరగతులకు అధికారులు ఇంగ్లిష్ మీడియం అనుమతి నిరాకరించారు. జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో కలిసి ఉపాధ్యాయులు రాష్ట్ర విద్యాశాఖ అధికారులను సంప్రదించారు. సానుకూలంగా స్పందించిన విద్యాశాఖ అధికారులు ఎట్టకేలకు ఇంగ్లిష్ మీడియానికి అనుమతి ఇచ్చారు. దీంతో 2019–20 సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. నాడు ఒకే విద్యార్థి ఉన్న పాఠశాలలో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 54కు చేరింది. మండలస్థాయిలో సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేసి విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించారు. జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ట్యూబ్‌లైట్ ఎగ్జిబిట్ ఉత్తమ ఎగ్జిబిట్‌గా ఎంపికైంది. విద్యార్థులకు జిల్లా సైన్స్ అధికారి సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు. అదేవిధంగా ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు సేవల ను గుర్తించిన జిల్లా అధికారులు.. గత సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయనకు ప్రశంస పత్రం అందజేసి, సన్మానించారు. పదో తరగతిలో వరుసగా ఆరు సంవత్సరాలుగా వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాఠశాల జిల్లాస్థాయి ప్రతిభా పురస్కారం సాధించింది.

దాతల చేయూత..

మాజీ సర్పంచ్ చీకటి ప్రకాశ్‌తోపాటు మరికొంత మంది దాతల సహకారంతో విద్యార్థులకు యూనిఫాం, బెల్టులు, షూ, సాక్స్‌లు ఇప్పించారు. విద్యార్థుల సౌకర్యార్థం డ్యూయల్ డెస్కులు, బెంచీలు సమకూర్చారు.


ఉపాధ్యాయులకు రుణపడి ఉంటాం..



నేను ఐదో తరగతి వరకు రంగాపురం ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నా. హైస్కూల్‌లో విద్యార్థులు లేరనే కారణంతో మా తల్లిదండ్రులు ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించారు. ఉపాధ్యాయులు మా ఇంటికి వచ్చి అమ్మానాన్నతోపాటు నాతో చర్చించారు. నాణ్యమైన విద్యను అందిస్తామని భరోసా కల్పించారు. కాగా, ఏడో తరగతిలో హైస్కూల్‌లో అడ్మిషన్ తీసుకున్నా. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా మా పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారు. పేద విద్యార్థుల కోసం పాఠశాలను కాపాడిన ఉపాధ్యాయులకు రుణపడి ఉంటాం.

– బలభద్రుల శ్రావ్య, పదో తరగతి

సమష్టి కృషితో సత్ఫలితాలు



పాఠశాలకు బదిలీపై వచ్చిన రోజు ఒకే ఒక విద్యార్థి చదువుకుంటున్నాడు. విషయం తెలియడంతో చాలా బాధనిపించింది. నిరుత్సాహానికి గురికాకుండా ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశాం. ఆనాటి సర్పంచ్ చీకటి ప్రకాశ్‌తోపాటు గ్రామస్తులతో చర్చించాం. వసతుల కల్పన కోసం దాతలు సహకరిస్తున్నారు. మూతపడుతుందనుకున్న పాఠశాలను కాపాడుకునేందుకు అడ్మిషన్లపై దృష్టి సారించాం. ప్రస్తుతం పాఠశాలలో 54 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉపాధ్యాయులు, గ్రామస్తుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది.

– మోతుకూరి శ్రీనివాసరావు, హెచ్‌ఎం

గీసుకొండ పీఏసీఎస్ కార్యదర్శి సస్పెన్షన్

గీసుకొండ: గీసుకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కార్యదర్శి సందెల క్రాంతికుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా సహకారి అధికారి సంజీవరెడ్డి పేరుతో ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ సొసైటీలోని నలుగురు రైతులకు వర్తించకుండా కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణల మేరకు ప్రాథమిక విచారణ చేసి సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో సొసైటీ స్టాఫ్ అసిస్టెంట్ కోల ప్రదీప్‌కు తాత్కాలిక ఇన్‌చార్జ్ కార్యదర్శి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

కరెంట్ ఎప్పుడొస్తుంది సార్ అని అడిగితే..

- విద్యుత్ ఏఈ, సబ్ ఇంజనీర్ బూతుల పర్వం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్

కాశిబుగ్గ: కాశిబుగ్గలో కరెంట్ ఎందుకు పోయింది.. ఎప్పుడోస్తది సార్ అని విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఓ క్యాజ్‌వల్ కార్మికుడు ఫోన్‌లో అడగగా 'నీకు నేను సమాధానం చెప్పాలా' అంటూ ఓ సబ్ స్టేషన్ ఏఈ బూతులతో ఫైరయ్యాడు. గురువారం కాశిబుగ్గలో జరిగిన ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. కొత్తపేటకు చెందిన కరుణాకర్‌రెడ్డి ఆరెపల్లి సబ్‌స్టేషన్‌లో క్యాజువల్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. దుస్తులు కొనుగోలు నిమిత్తం కాశిబుగ్గకు రాగా కరెంట్ పోయిందని ఆ షాపు నిర్వాహకులు చెప్పారు. దీంతో కరుణాకర్‌రెడ్డి నేను అడిగి తెలుసుకుంటానని ఫోన్‌లో మిల్స్ కాలనీ సబ్‌స్టేషన్ ఏఈకి కాల్ చేశాడు. దీంతో ఏఈ 'నువ్వు నాకు కాల్ చేస్తావా? కాంట్రాక్ట్ లేబర్‌వి.. నీకు నేను సమాధానం చెప్పాలా' అంటూ బూతులు తిట్టాడు. దీంతో కరుణాకర్‌రెడ్డి కూడా ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ విషయం ఏఈ.. గొర్రెకుంటలోని సబ్ ఇంజనీర్‌కు చెప్పడంతో ఆయన, ఏఈ.. మళ్లీ కరుణాకర్‌రెడ్డికి ఫోన్ చేసి ఓ అధికారితో అలా మాట్లాడుతావా అంటూ ఫోన్‌లో బూతులు తిడుతూ బెదిరింపులకు దిగారు. దీనికి కరుణాకర్‌రెడ్డి నేను కరెంట్ విషయం గురించి అడిగితే అధికారి బూతులు తిడతారా? సామాన్యులకు సమాధానం చెప్పరా అంటూ వాగ్వాదం చేశారు. దీనికి ఏఈ, సబ్ ఇంజనీర్ నువ్వు ఎక్కడ ఉన్నావో చెప్పు నీ అంతు చూస్తామని బెదిరింపులకు దిగిన మాటలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈఘటన బయటకు రావడంతో నగరవాసులు కూడా తాము కరెంట్ వాళ్లకు ఫోన్ చేస్తే సరిగా సమాధానం చెప్పడం లేదని పేర్కొంటున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ఉత్తములకు ప్రశంసపత్రాలు



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకుంటున్న డీటీడీఓ సౌజన్య

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ప్రశంసపత్రాలు అందుకున్నారు. ఖిలావరంగల్ మధ్యకోటలో గురువారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద.. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులతోపాటు క్రీడాపోటీల విజేతలకు ప్రశంసపత్రాలు ప్రదానం చేశారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్



అశోక్, మేయర్ సీసీ | సత్యనారాయణ ట్రాఫిక్ ఏసీపీ | రమేశ్, ఇన్‌స్పెక్టర్ ఏనుమాముల | పి.శ్రీకాంత్, ఎస్సై ఏనుమాముల



వె.యాదగిరి, ఏఎస్సై పర్వతగిరి | బి.వెంకన్న, ఎస్సై ఇంతేజార్‌గంజ్ | కె.భాస్కర్, హెచ్‌సీ షీటీం వరంగల్ | బి.పీటర్, హెచ్‌సీ వర్ధన్నపేట | సునీత, ఈఈ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ | డి.వాసంతి, డీఈఓ | ఫణికుమార్, తహసీల్దార్ చెన్నారావుపేట | ఎండీ.రియాజుద్దీన్, తహసీల్దార్ గీసుకొండ | నందిరాంనాయక్, ఏసీపీ వరంగల్ | రాజగోపాల్, సీఐ దుగ్గొండి | బి.రాజు, ఇన్‌స్పెక్టర్ | స్వర్ణలత, హెచ్‌సీ



విజేందర్, పీసీ | మణి ఏఎస్సై, మట్టెవాడ ట్రాఫిక్ | వి.వేణు, హోంగార్డు గీసుకొండ | ఎ.సురేశ్, హెచ్‌సీ ఇంతేజార్‌గంజ్ | వై.జ్యోతి, ఎక్సైజ్ ఎస్సై | చంద్రమౌళి, హెచ్ డబ్ల్యూ సెంట్రల్ జైల్ | కె.శ్రీదేవి, వార్డు ఆఫీస్ వర్ధన్నపేట | బి.లక్ష్మి, ఏపీఓ, డీఆర్‌డీఏ | జి.సురేశ్, సీటీఏ డీఆర్‌డీఏ | అరుణ, అటెండర్ డీఆర్‌డీఏ | ఎ.రాజు, సీఓ డీఆర్‌డీఏ నర్సంపేట | ఎన్.జానకి, ఎఫ్‌ఏ డీఆర్‌డీఏ గురిజాల



వెంకటరమణ, డీఎంహెచ్‌ఓ | ఎస్.మధు 108 పైలట్ డ్రైవర్ | ఎస్.అనూష, ఏఈ పీఆర్ | శ్రీకాంత్, ఏఈ ఆర్అండ్‌బీ | శ్రీకాంత్, హార్టికల్చర్ సూపరింటెండెంట్ | వై.జ్యోతి, కోఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ నర్సంపేట | శ్రీనివాస్‌రావు, మార్కెట్ సూపర్‌వైజర్ | బి.దయాకర్, పౌరసరఫరాల శాఖ | శ్రీజన్య, జిల్లా ట్రెజరీ అకౌంటెంట్ | డి.అశ్విని, సైంటిస్ట్ అగ్రికల్చర్ వర్సిటీ | ఎ.విల్సన్, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ | శ్రీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఇండస్ట్రీస్



హుస్సేన్, అటెండర్ విద్యాశాఖ | ఎ.నాగరాజు ఎంపీఓ, నెక్కొండ | బి.వసంత, నెక్కొండ అగ్రికల్చర్ | పి.జయషీల్, ట్రైపిస్ట్ అగ్రికల్చర్ ఆఫీస్ | పీహెచ్.రామన్‌కర్, జూనియర్ లెక్చరర్ | జె.సాయికిరణ్, సైంటిస్ట్ కేవీకే | ఎం.రాజేందర్, వెటర్నరీ అసిస్టెంట్ | సతీశ్‌కుమార్, హెచ్‌డబ్ల్యూఓ | ఆర్.రాకేష్, హెచ్‌డబ్ల్యూఓ | ఆర్.రవీందర్ డీఈ, టీజీఈడబ్ల్యూఐడీసీ | ఎండీ. ఖాలీద్‌అలీ, సీఓ మెప్మా | ఏవీ.రాంప్రసాద్, డీఈ ఇరిగేషన్

మేలిమి ఆశ చూపి.. నకిలీ బంగారం అంటగట్టి

- డబ్బులు దండుకుని ఉడాయించిన వ్యక్తులకు దేహశుద్ధి
- పోలీసులకు అప్పగింత



ఉడాయించిన ఇద్దరిని (కూర్చున్న వారు) ప్రశ్నిస్తున్న బాధితుడు

బయ్యారం: మాయమాటలతో మేలిమి చూపి..ఆ తరువాత నకిలీ బంగారం కుదవపెట్టి డబ్బులు తీసుకున్న ఇద్దరు వ్యక్తులకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం బయ్యారంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కురవి మండలం రాజోలుకు చెందిన కలకోటి రాము అదే గ్రామంలో బాలా జీ సూపర్‌మార్కెట్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మూడునెలల క్రితం రాజస్తాన్‌కు చెందిన గణేశ్, క్రాంతిలాల్, తదితరులు సూపర్‌మార్కెట్‌కు వెళ్లి సరుకులు కొనుగోలు చేశారు. ఈ సమయంలో తమకు బంగారం గొలుసు దొరికిందని రాముకు చెప్పి గొలుసులోని చిన్న ముక్క ఇవ్వగా అతను మహబూబాబాద్‌లో నాణ్యత పరీక్షించుకుని బంగారంగా నిర్ధారించుకున్నాడు. ఆ తరువాత కొన్ని రోజులకు గొలుసుతో రాము వద్దకు వచ్చిన రాజస్తాన్ వాసులు తమకు డబ్బులు అవసరం ఉన్నాయని, రూ. రెండు లక్షలు ఇస్తే సుమారు 8 తులాల బంగారం గొలుసు ఇస్తామని చెప్పారు. దీంతో రాము వారికి డబ్బులు ఇచ్చి గొలుసు తీసుకున్నాడు. అనంతరం గొలుసును ముత్తూట్ ఫైనాన్స్‌లో తనఖా పెట్టి డబ్బులు తీసుకుందామని రాము మహబూబాబాద్ వెళ్లగా అక్కడ పరీక్షించిన నిర్వాహకులు నకిలీ బంగారంగా గుర్తించారు. దీంతో రాము తనకు చిన్న బంగారం వస్తువు అందించి నకిలీ గొలుసు ఇచ్చి మోసగించిన ట్లు గుర్తించి వారి ఆచూకీ కోసం గాలిస్తున్నాడు. ఈ క్రమంలో బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో గణేశ్, క్రాంతిలాల్ సంచరిస్తున్నట్లు సమాచారం తెలుసుకుని వారిని పట్టుకున్నారు. ఈ సమయంలో కొందరు వ్యక్తులు వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

వరంగల్ రీజియన్‌ను అగ్రగామిగా నిలపాలి

- ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను

హన్మకొండ: లాభాల్లో వరంగల్ రీజియన్‌ను అగ్రగామిగా నిలపాలని ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం డి.విజయభాను అన్నారు. గురువారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణంతో బస్సుల్లో రద్దీ పెరిగిందన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి ఉద్యోగులు కష్టపడుతున్నారన్నారు. ప్రయాణికుల ఆదరాభిమానాలు చూరగొంటూ కార్పొరేషన్‌లో వరంగల్ రీజియన్‌ను ఆదాయంలో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. వరంగల్–2 డిపో అసిస్టెంట్ మేనేజర్ జ్యోత్స్న, అసిస్టెంట్ మెకానికల్ ఈ.అమల, వరంగల్–2 డ్రైవర్ బి.వెంకన్న, వరంగల్–1 డిపో డ్రైవర్ ఎ.రమేశ్, మహబూబాబాద్ డ్రైవర్ వి.శ్రీనివాస్, హనుమకొండ డిపో కండక్టర్ జి.సరళాదేవి, మెకానిక్ జి.దేవేందర్‌కు ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు కె.భానుకిరణ్, జి.మాధవరావు, అకౌంట్స్ ఆఫీసర్ ఎ.రవీందర్, పర్సనల్ ఆఫీసర్ రామ్మోహన్ రావు, ఈఈ భాస్కర్ పాల్గొన్నారు.



జాతీయ పతాకం ఆవిష్కరించి మాట్లాడుతున్న ఆర్ఎం డి.విజయభాను

ప్రాణాపాయం నుంచి గట్టెక్కారు..

- కారు డోర్ లాక్..వాహనంలోనే చిన్నారులు
- అర్ధగంటకు పైగా భయానక వాతావరణం
- మెకానిక్ సాయంతో తెరుచుకున్న డోర్‌లు
- ఊపిరిపీల్చుకున్న తల్లిదండ్రులు



సుబేదారిలో కారులో ఉన్న ఇద్దరు పిల్లలను బయటకు తీస్తున్న స్థానికులు

హన్మకొండ అర్బన్: తల్లిదండ్రులు తమ ఇద్దరు చిన్నారులను కారులో వదిలి మందుల కొనుగోలు నిమిత్తం మెడికల్ షాపునకు వెళ్లారు. అనుహ్యంగా కారు డోర్ లాక్ అయింది. దీంతో అర్ధగంటకు పైగా భయానక వాతావరణం నెలకొంది. కొత్తూరు జెండాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రీకాంత్, శ్రావణి దంపతులు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను తిలకించడానికి గురువారం కారులో పుర వీధుల్లోకి వచ్చారు. జెండా వందనాలు చూసిన అనంతరం సుబేదారిలోని 'ఏ టు జెడ్' మెడికల్ షాపులో మందులు కొనడం కోసం కారులో నుంచి దిగారు. ఆ సమయంలో కారులో ఉన్న తాళంతో పిల్లలు డోర్ లాక్ చేశారు. బయటకు వచ్చిన తల్లిదండ్రులు కారు డోర్ తెరవడానికి యత్నించి విఫలమయ్యారు. లోపల ఉన్న పిల్లలకు ఊపిరి తీసుకోవడం కష్టమవుతుందని ఆందోళన చెంది వెంటనే మెకానిక్‌కు ఫోన్ చేస్తూ స్థానికుల సహకారంతో కారు డోర్ తెరవడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ క్రమంలో అర్ధగంట తర్వాత మెకానిక్ వచ్చి కారు డోర్‌లు తెరవడంతో పిల్లలు బయటకు వచ్చారు. దీంతో చూపరులతో పాటు తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

పోడుకు యత్నించిన ఇద్దరిపై కేసు నమోదు

భూపాలపల్లి : అటవీ భూమిని నరికి పోడు చేసేందుకు యత్నించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు అటవీశాఖ భూపాలపల్లి రేంజ్ ఆఫీసర్ బస్వ నరేశ్ తెలిపారు. ఎఫ్ఆర్ఓ కథనం ప్రకారం.. రాంపూర్ నార్త్ 4వ బీట్‌లోని రక్షిత అటవీ ప్రాంతంలో ఒకరు చెట్లు నరుకుతున్నట్లు గురువారం సమాచారం అందింది. ఈ మేరకు ఘటనా స్థలికి చేరుకుని చెట్లు నరుకుతున్న సింగరవేణి నరేందర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడిని విచారించగా తాను కూలీ పని నిమిత్తం వచ్చానని, సింగరేణి భూపాలపల్లి ఏరియాలో పని చేసే టి. రఘోత్తంరెడ్డి 20 ఎకరాల భూమి చదును చేసేందుకు రూ. 40 వేలు ఇస్తానని చెప్పినట్లు తెలిపాడన్నారు. దీంతో రఘోత్తంరెడ్డిని కూడా అదుపులోకి తీసుకుని విచారించగా, తాను నాగారం చెందిన మధ్యవర్తుల ద్వారా ఆ భూమిని కొనుగోలు చేశానని వెల్లడించారన్నారు. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ వెల్లడించారు. అటవీ భూమిని ఎవరూ కొనుగోలు చేసి మోసపోవద్దని, అడవిలో చెట్లు నరికినా, పోడుకు ప్రయత్నించినా చర్యలు తప్పవని ఎఫ్ఆర్ఓ నరేశ్ హెచ్చరించారు.

ఇంటి భోజనానికి..

భారత సర్కారు గుర్తింపు

నర్సంపేటలోని ఉప్పలయ్య హోటల్‌కు జాతీయ ప్రశంస



నర్సంపేట పట్టణంలోని ఉప్పలయ్య హోటల్



ఉప్పలయ్య హోటల్‌కు వచ్చిన సర్టిఫికెట్

నర్సంపేట: ఫైవ్ స్టార్ హోటళ్లు ఎన్ని ఉన్నా.. రుచికరమైన ఇంటి భోజనం ఎక్కడ దొరికితే అక్కడికి భోజన ప్రియులు పరుగెత్తుతారు. అటువంటి ఇంటి భోజనం లభిస్తున్న ఓ చిన్న హోటల్‌కు భారత సర్కారు గుర్తింపు లభించింది. ఇప్పుడు ఆ హోటల్ పేరు సామాజిక మాధ్యమాల్లో మార్మోగుతోంది. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో ముప్పై సంవత్సరాల క్రితం ఉప్పలయ్య తన ఇంట్లోనే (ఉప్పలయ్య హోటల్) మెస్‌ను ప్రారంభించారు. తక్కువ ధరకే ఇంటి భోజనాన్ని అందించడంతో భోజన ప్రియులు విపరీతంగా వచ్చేవారు. కొంతకాలం తరువాత ఉప్పలయ్య అనారోగ్యంతో చనిపోయారు. ఆ తర్వాత హోటల్‌ను తన కుమారుడు శ్రీనివాస్ కుటుంబ సభ్యులు నడిపిస్తూ వస్తున్నారు. కుటుంబ సభ్యులు మొత్తం హోటల్ నిర్వహణ చూసుకుంటున్నారు. రుచిలో ఏ మాత్రం తేడా రాకుండా తన తండ్రి ఏ విధంగా లాభాపేక్ష లేకుండా నడిపించాడో కుమారుడు శ్రీనివాస్ కూడా అలాగే నడిపిస్తున్నాడు. ఈ హోటల్‌కు రోజూ సుమారు 200మందికిపైగా వచ్చి భోజనం చేస్తున్నారంటే రుచి ఎలా ఉంటుందో మనం అర్థం చేసుకోవచ్చు.

జాతీయ గుర్తింపు ఎలా వచ్చిందంటే..

ఈ హోటల్‌లో వెజ్, నాన్‌వెజ్ తక్కువ ధరలో అందిస్తున్నారు. వినియోగదారుడి ధరకు అందుబాటులో ఉండేలా నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలుసుకున్న భారత ప్రభుత్వం(మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్) నుంచి రీజనల్ హెడ్ ఆఫీస్ హైదరాబాద్ సభ్యులు రెండు నెలల కిందట ఈ హోటల్‌కు వచ్చి భోజనం చేసి బాగుందని చెప్పి వెళ్లిపోయారు. ఈ నెల 12(సోమవారం)న మరోసారి హోటల్‌కు వచ్చి మీ హోటల్‌కు అవార్డు వచ్చిందని చెప్పి శ్రీనివాస్‌కు సర్టిఫికెట్ అందజేశారు. ఇదే నాణ్యతను కొనసాగిస్తూ భోజన ప్రియులకు నాణ్యమైన, రుచికర భోజనాన్ని అందించాలని అభినందించారు.

మంచి పేరు కోసమే..



హోటల్ పెట్టినప్పటినుంచి మా ఇంట్లోనే భోజనాలు ఏర్పాటు చేసేవాళ్లం. నాణ్యతతోపాటు తక్కువ ధరలకు భోజనం అందిస్తూ వచ్చాం. హోటల్‌కు వచ్చే వాళ్లకు మంచి రుచితో కూడిన భోజనాలు అందించాలని మా నాన్న ఉప్పలయ్య చెప్పేవారు. ఆయన అదే విధంగా చాలా సంవత్సరాలు నడిపించారు. నాన్న చూపిన బాటలోనే హోటల్‌ను నడిపిస్తున్నాం. దీని ద్వారానే జాతీయ స్థాయి అవార్డు లభించింది..పెద్ద పెద్ద హోటళ్లకు దక్కని అవార్డు మా హోటల్‌కు లభించడం సంతోషకరంగా ఉంది.

– జల్ల శ్రీనివాస్, ఉప్పలయ్య హోటల్ నిర్వాహకుడు, నర్సంపేట

తన వద్దకు అమ్మమ్మ రావడం లేదని..

- మనస్తాపంతో యువతి ఆత్మహత్య
- భీమదేవరపల్లిలో ఘటన



నిఖిత మృతదేహం

ఎల్కతుర్తి: తన వద్దకు అమ్మమ్మ రావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం భీమదేవరపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మారుపాటి నిఖిత(22) కేయూలో పీజీ చదువుతుంది. నిఖితకు అమ్మమ్మ అంటే చాలా ఇష్టం. ఈ క్రమంలో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిర్సపల్లికి చెందిన నిఖిత అమ్మమ్మ కొంతకాలంగా నిఖిత ఇంటికి రావడం లేదు. ఈ ఘటనపై అమ్మమ్మ ఇంటికి ఎందుకు రావడం లేదని కుటుంబీకులను అడుగుతూ బాధపడుతుండేది. ఈ క్రమంలో ఈనెల 14న పరీక్ష రాసేందుకు వెళ్లిన నిఖిత. సాయంత్రం ఇంటికి చేరుకుంది. రాత్రి తండ్రి మహేందర్‌రెడ్డి, తల్లి సుమతి, అక్క ప్రియదర్శినితో కలిసి భోజనం చేసిన అనంతరం నిద్రించడానికి తన రూమ్‌లోకి వెళ్లింది. తెల్లారినా నిఖిత నిద్ర నుంచి లేవకపోవడంతో తండ్రి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో రూమ్‌కు వెళ్లి తలుపు కొట్టగా ఎంతకూ తీయలేదు. మహేందర్ రెడ్డి తన స్నేహితుడితో కలిసి బలవంతంగా తలుపు తీయగా నిఖిత ఉరేసుకుని కనిపించింది. ఈ ఘటనపై మహేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్.. మహేందర్‌రెడ్డి ఇంటికి చేరుకుని కుటుంబీకులను ఓదార్చారు.

కుటుంబ కలహాలతో యువకుడు..

చిల్పూరు: కుటుంబ కలహాలతో మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కలకోళ వెంకటేశ్(36) హైదరాబాద్‌లోని ఇంట్లో గురువారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్ మృతితో కుటుంబంతోపాటు కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య జ్యోతి, ముగ్గురు కుమారులు ఉన్నారు.